క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఎంఓ రవిశంకర్

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీపీఎంఓ రవిశంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా స్పర్శలేని రాగి మచ్చలు ఉంటే ఆస్పత్రికి పంపించాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణమ్మ, సూపర్‌వైజర్ రాము, విజయలక్ష్మి, ఫార్మసిస్టు బాబురావు, ల్యాబ్ టెక్నీషియన్ హరి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

తాడిపత్రి రూరల్: బాపట్ల జిల్లాలోని అద్దంకిలో ఇటీవల నిర్వహించిన జాతీయ మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో గన్నెవారిపల్లికాలనీ విద్యార్థులు ప్రతిభ చూపారని జపాన్ షూటోరియో కరాటే ట్రైనింగ్ మాస్టర్ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. టోర్నమెంట్‌లో 450మంది విద్యార్థులు పాల్గొనగా ప్రణీత్‌కుమార్, గురచరణ్, మనోహర్‌రెడ్డి, రిషిక్‌రెడ్డి, ఆదిత్య, నిశాంత్‌కుమార్‌రెడ్డి గెలుపొందారన్నారు. వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారని ఆయన తెలిపారు.

స్వీయ రక్షణపై అవగాహన



మాట్లాడుతున్న ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరి

గుంతకల్లు: పట్టణంలోని పలు మున్సిపల్ పాఠశాలల్లో మిషన్ శక్తి కిశోరి వికాసం–2లో భాగంగా బాలికల రక్షణపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కళాజాతా సిబ్బందిచే బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సెల్ఫ్ డిఫెన్స్‌పై కరాటే మాస్టర్ హరికృష్ణ కరాటేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న చిన్నారి జ్ఞాన శ్రీ

గుత్తి: అనంతపురంలో ఈ నెల 14,15,16వ తేదీల్లో నిర్వహించిన బాలోత్సవంలో గుత్తిలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 7వ తరగతి విద్యార్థిని కీర్తన కార్టూన్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. క్లాసికల్ డాన్స్‌లో 5వ తరగతి చిన్నారి జ్ఞాన శ్రీ ద్వితీయ స్థానాన్ని సాధించింది. అదే విధంగా ఫోక్ డాన్స్‌లో లాస్య తృతీయ స్థానాన్ని సాధించింది. నిర్వాహకులు వారికి బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన చిన్నారులను పాఠశాల యాజమాన్యం వేదమూర్తి, విద్యాధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు: మండలంలోని భీమునిపల్లికి చెందిన విజయలక్ష్మి అనే మహిళ విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

సస్యరక్షణతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

తాడిపత్రి రూరల్: సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధ్యమనిరెడ్డిపల్లి ఉద్యానశాఖ శాస్త్రవేత త్రికల మాధవి, ఉద్యానవనశాఖ అధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి, బ్రహ్మణపల్లిలోని చీనీ తోటలను సోమవారం వారు పరిశీలించారు. వెంకటరెడ్డిపల్లిలోని కోనేశ్వరరెడ్డి, అనిల్‌కుమార్‌కు చెందిన పొలాల్లో చీనీ చెట్లకు సిల్లా తెగులు సోకినట్లు గుర్తించారు. ఈ తెగులు ఆకుల్లోని రసం పీల్చి కొమ్మలను గూడు కట్టుకుంటాయని రైతులకు వివరించారు. కొమ్మల్లో తెల్ల పురుగులు అతుక్కుని ఉండి ఆకుల రసం పీలుస్తాయన్నారు. సకాలంలో సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా



- అక్రమార్కుల బరితెగింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



పెన్నానది నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

పామిడి: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సహజ సంపదలను అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ఇసుక, గరుసు అక్రమ రవాణా అక్రమదారులకు కాసులపంట కురిపిస్తోంది. ఇసుక అక్రమ రవాణాతో పెన్నానదికి గర్భశోకం మిగులుతోంది. అలాగే గరుసు అక్రమ రవాణా కొనసాగిస్తుండడంతో కొండలు ఇట్టే కరిగిపోతున్నాయి. దీంతో ప్రకృతి వైపరీత్యాలు నెలకొనే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పామిడి సమీపంలోని పెన్నానది నుంచి రోజూ ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. స్థానిక కొండూరు రోడ్డు, రైల్వే వంతెన తదితర ప్రాంతాల నుంచి అక్రమార్కులు యథేచ్ఛగా తెల్లబంగారాన్ని తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. పామిడికి సంబంధించి ఎటువంటి రీచ్ అనుమతులు లేకపోయినా అధికారం మాదేనంటూ అధికార పార్టీ నేతలు అధికార దర్పంతో ఈ రవాణాను జోరుగా సాగిస్తున్నారు. రోజూ వందలాది ట్రాక్టర్లు పట్టపగలే అక్రమంగా అనంతపురం, గుంతకల్లు తదితర ప్రాంతాలకు తరలి వెళ్తున్న పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్, ఇంటలిజెన్స్ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తుండడంపై ఆంతర్యమేమిటోనన్న? ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇకపోతే రేపో! మాపో!! స్థానిక కొండూరురోడ్డులోని పెన్నానది నుంచి టిప్పర్లతో భారీగా ఇసుక అక్రమ తరలింపు యత్నాన్ని అక్కడ సాగుచేస్తున్న రైతుల నుంచి పూర్తిగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం

పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి సాగు, తాగుకు వేసవి రాకనే తీవ్ర నీటిఎద్దడి నెలకొనే అవకాశం ఉందని స్థానిక రైతులు, ప్రజలు వాపోతున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా అనుమతులు లేకుండా ఇసుక యథేచ్ఛగా ట్రాక్టర్లలో అనంతపురం, గుంతకల్లు తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా సాగుతోంది. ఇకపోతే రాత్రివేళ టిప్పర్లలో సైతం పెన్నానది నుంచి ఇసుక భారీగా అక్రమంగా తరలివెళ్తోంది. టిప్పర్ల ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి శింగనమల, గుంతకల్లు నియోజవర్గాల అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు వేల రూపాయల్లో ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణాను అరికట్టి వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం



పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరకుంది. దీంతో ఒకప్పుడు ఇసుక దిన్నెలతో కళకళలాడే పెన్నాతీరం కళా విహీనమైంది. తెల్లబంగారం అక్రమ రవాణాతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉంది. తద్వారా వేసవి రాకనే నీటిఎద్దడి నెలకొనే ప్రమాదం లేకపోలేదు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి నీటిఎద్దడి రాకుండా నివారించాలి.

–వీ బుజ్జిబాబు, పామిడి

అధికారులు స్పందించాలి



మండలంలో అక్రమార్కులు కొండలను సైతం పిండి చేస్తున్నారు. గరుసును అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. దీని ప్రభావం ప్రకృతి వైపరీత్యాలపై లేకపోలేదు. వర్షాభావం వల్ల వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయే ఆస్కారం ఉంది. గరుసు అక్రమ రవాణా కోసం కొండల తవ్వకాన్ని అధికారులు అరికట్టాలి.

–సీ సురేష్, పామిడి

చర్యలు తీసుకుంటాం



సహజ సంపదలైన పెన్నానది ఇసుక, ప్రకృతి ప్రసాదించిన కొండల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. మరీముఖ్యంగా ఇసుక, గరుసు అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. అక్రమంగా రవాణాదారులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి నివారణకు తప్పక చర్యలు చేపడతాం.

– ఎస్.శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి

గుత్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి చూపిందని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, సీపీఐ మండల కార్యదర్శి రాందాసు, సీపీఐ మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు మహమూదా, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్, సీపీఎం జిల్లా నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కార్పొరేట్లకు మేలు చేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టి రాష్ట్రాలకు రిక్త హస్తం చూపారన్నారు. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, నిరుపేదలకు ఈ బడ్జెట్ ద్వారా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. పేదలకు మేలు చేసే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఓబిలేసుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు మధుసూదన్‌రావు, రాజుయాదవ్, మల్లికార్జున, వెంకట్రాముడు, సాయి, బాబి, రేణుకమ్మ, కవిత, రేవతి, నజీర్ పాల్గొన్నారు.



గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

పామిడి: కర్షక, కార్మిక, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వామపక్షపార్టీ నాయకులు పీ అనిమిరెడ్డి, కే రహీమ్, వీరభద్రస్వామి తదితరులు మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలను నట్టేట ముంచేలా ఉన్న కేంద్ర బడ్జెట్‌పై వారు దుమ్మెత్తి పోశారు. కేంద్రం తన వైఖరి మార్చుకోకపోతే అందరినీ సంఘటితం చేసి ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు నాగరాజు, బాబాఫకృద్దీన్, శివకుమార్, మల్లేష్, శంకర్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జెండా కట్టకు అడ్డంగా గోడ కట్టారు..



న్యాయం చేయాలని ఎస్‌ఐని కోరుతున్న మహిళలు

గుత్తి: జెండా కట్టకు వెళ్లకుండా కొందరు దౌర్జన్యంగా గోడ కట్టారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గుత్తిలోని ఓల్డ్ సీపీఐ కాలనీకి చెందిన మహిళలు సోమవారం పోలీసులు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓల్డ్ సీపీఐ కాలనీలో జెండా కట్టకు అడ్డంగా కట్టిన గోడను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ సురేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్‌ఐతో పాటు మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు శాంతించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

గుత్తి/తాడిపత్రిరూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనలు చేపడతామని సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ అధ్యక్షురాలు రేష్మా హెచ్చరించారు. గుత్తిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. బీమా సదుపాయం కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, హెల్పర్లకు వర్కర్లుగా పదోన్నతి కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 3 లక్షలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాల డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ సీడీపీఓ నాగమణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు గంగా, జయంతి, మహాలక్ష్మి, శోభారాణి, గంగమ్మ, పార్వతి, అనిత, పద్మజ,కళ్యాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న సీడీపీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్లు యూనియన్ నేతలు జ్యోతిలత, శకుంతల, గోవిందమ్మ తదితరులు ధర్న చేశారు.



గుత్తిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఘనంగా రామకోటి తిరునాల

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో సోమవారం రాత్రి రామకోటి తిరునాల ఘనంగా నిర్వహించారు. సీతారాములను దర్శించుకోవాడానికి స్థానికులే కాక పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. తిరునాల సందర్భంగా చెరుకు గడల అమ్మకాలు, గాజుల అంగళ్లు, నోరూరించే తినుబండారాలు, చిన్నారులను ఆకట్టుకునే ఆట వస్తువుల దుకాణాలు జోరుగా సాగాయి. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెద్దవడగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏటా అశ్వత్థం మూడో ఆదివారం తిరునాల మరుసటి రోజు రామకోటి తిరునాల జరగనున్నట్లు ఆలయ పర్యవేక్షకుడు చింతా నరసింహులు తెలిపారు.



అలంకరణలో సీతారాములు

హోరాహోరీగా రాతిదూలం పోటీలు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న రాతిదూలం లాగుడు పోటీల్లో మూడో రోజు సోమవారం హోరాహోరీగా సాగాయి. న్యూ కేటగిరీ విభాగంలో 11 జతల వృషభాలు పాల్గొన్నాయి. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన ఇంద్రారెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.50 వేలు పొందాయి. కర్నూలు జిల్లా డోన్ మండలం కొత్తకోటకు చెందిన డాక్టర్ గుర్నాథ్‌రెడ్డి వృషభాలు రెండో స్థానంలోని నిలిచి రూ.40 వేలు, యాడికి మండలం యంగన్నపల్లికి చెందిన లక్ష్మీరంగారెడ్డి వృషభాలు మూడో బహుమతి రూ.30 వేలు, నంద్యాల జిల్లా అలగనూరుకు చెంది న రోలీ వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ.20 వేలు గెలుపొందాయి. మంగళవారం సీనియర్ విభాగంలో పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు చిన్నరెడ్డి యాదవ్, రంగస్వామిరెడ్డి యాదవ్ తెలిపారు. ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



సంక్షిప్త సమాచారం

శింగనమలకు రహదారి చూపండి

శింగనమల: అనంతపురం–విజయవాడ జాతీయ రహదారి 544–డీ నుంచి శింగనమల క్రాస్ వద్ద శింగనమలలోకి వచ్చేలా రహదారిని చూపాలని సీపీఐ, జై భీం, ఎమ్మార్పీఎస్, టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు.

ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి

శింగనమల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలు ర్యాలీ చేసి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యెం నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాస్టర్ షాలెం రాజు కుటుంబానికి పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ మార్క్ బిషన్ వాసు, అనీల్ కాంత్ పాస్టర్ మనష్, పాస్టర్ ఆనంద్, పాస్టర్ వైపీ బాబు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుంతకల్లు: పట్టణంలోని రైల్వే జంక్షన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని వద్ద ఆంజనేయులు (62) పేరుపై గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు గల ఓపీ చీటీ లభ్యమైంది. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తుపడితే 98661 44616లో సంప్రదించాలని జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర విజ్ఞప్తి చేశారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కారించకపోతే ఈ నెల 20, 21న కార్మికుల మాస్టర్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 24వ తేదీ మున్సిపల్ కార్యాలయ వద్ద ధర్నా, మార్చి 3న కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి, మార్చి 8న చలో విజయవాడ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జే.నరసయ్య, చిన్న కొండయ్య, చిన్నయ్య, వెంకటేశులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి శివారులో సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారానికి చెందిన హరికృష్ణ ద్విచక్రవాహనంలో గుత్తి వైపు వస్తుండగా లచ్చానుపల్లికి చెందిన ఆదర్శ్ అనే యువకుడు బైక్‌లో వస్తూ మలుపులో ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన హరికృష్ణను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదర్శ్‌ను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. హరికృష్ణను వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పామిడి: అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం జీపీ సాధారణ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌తో పాటు హై ఇంపాక్ట్ నిధులతో నిర్మించిన భోగేశ్వరాలయ సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, గుమ్మనూరు నారాయణస్వామి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల చెన్నకేశవ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన బోరు సీజ్ చేయండి

- టీడీపీ నాయకుడిపై అదే పార్టీ కార్యకర్త ఫిర్యాదు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లి చెరువులో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వేసిన బోరు సీజ్ చేయాలని గ్రామ టీడీపీ కార్యకర్త ప్రసాద్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కావేదిక కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటేష్ చెరువులో భూమి అక్రమించి, అనుమతులు లేకుండా బోరు వేయడంతో చుట్టు ప్రక్కల బోర్లు ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిపై పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తే కులం పేరుతో దూషిస్తున్నారన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి బోరు సీజ్ చేయాలని ఆయన కోరారు.

యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం కమిటీ ఎంపిక



ఎంపికైన యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం కమిటీ సభ్యులు

గుంతకల్లు: పట్టణ యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం నూతన కమిటీని ఎంపిక చేసినట్లు డాక్టర్ జార్జిపాల్ తెలిపారు. సోమవారం మోదీనాబాద్‌లోని మెస్సీయా చర్చిలో జరిగిన సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శిగా కేవీజే పాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.సురేష్, కోశాధికారిగా పి.ఆంథోని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.జాన్ కెన్నెడి, సహాయ కార్యదర్శులుగా ఎస్.జ్యోతిరాజు, కే.అహరోను, ఎస్.దానియేలు, రంజిత్‌కుమార్ ఎంపికయ్యారు. వీరితో పాటు సలహాదారులు, ఎగ్జిక్యూటివ్ కమిటి మెంబర్లను కూడా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. సేవా మార్గంలో నడుస్తూ ఆదర్శంగా కమిటీని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

ఘనంగా గులామ్‌షా ఉరుసు



షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పోర్టర్స్ లైన్‌లో వెలసిన హజరత్ సయ్యద్ గులామ్‌షా ఖాద్రీ స్వామి 65వ ఉరుసు ఘనంగా నిర్వహించారు. సోమవారం మేళతాళాలు,డప్పువాయిద్యాల నడుమ స్వామివారి షంషీర్‌ను ఊరేగించారు. ఈ సందర్భంగా దర్గా పెద్దలు స్వామివారికి పూలచాదర్‌ను సమర్పించారు. భక్తులు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా కమిటీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పెద్దపప్పూరు: మాఘమాసం మూడో ఆదివారం తిరునాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం దేవదాయ శాఖ స్పెషల్ ఆఫీసర్ వన్నూస్వామి, ఈఓ సుబ్రమణ్యం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.8,24,413, శాశ్వత హుండీలు రూ.5,09,968, శీఘ్ర దర్శనం టిక్కెట్లు రూ.2,36,000, విరాళాలు రూ.30,394, తలనీలాల టిక్కెట్లు రూ.17,650, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.300 మొత్తం 14,06,325 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గార్లదిన్నె రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు, బ్యాంక్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు నేటి నుంచి ఇంటర్వ్యూలు

శింగనమల/యల్లనూరు/గార్లదిన్నె/పామిడి/గుంతకల్లు రూరల్/పెద్దవడుగూరు: బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రహ్మణ, కాపులకు మంజూరైన రుణ యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. లబ్ధిదారులు బ్యాంకు ఖాతా, ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ, విద్యార్హతల పత్రాలు తీసుకురావాలని శింగనమల, యల్లనూరు, గార్లదిన్నె, పామిడి ఎంపీడీఓలు భాస్కర్, వాసుదేవరెడ్డి, బాబా ఫ్రకృద్దీన్, తేజోత్స్న సూచించారు. అలాగే గుంతకల్లు, పెద్దవడుగూరు మండలాల్లో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు శ్రీకాంత్ చౌదరి, బారెన్‌సాహెబ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ మృతి



సుబ్బయ్య మృతదేహం

కమలాపురం: కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని గొల్లపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ కంబాల సుబ్బయ్య (45) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. దేవుని కడపకు చెందిన సుబ్బయ్య తాడిపత్రిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున బైక్‌లలో తాడిపత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో కమలాపురం మండలం గొల్లపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాగా మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవ దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో సోమవారం గ్రామస్తులు, శివమాలధారుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు దేవగుడి రామేశ్వరశర్మ, సోమశంకర్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్‌కుమార్ తదితరుల వేదమంత్రోచ్చారణల నడుమ పెళ్లి తంతు చేశారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు ఈశ్వర్, తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓ గోపాల్ పాల్గొన్నారు.